# పైరుగాలి

నేను కవిని; కళాకారుణ్ణి.

కవులకీ కళాకారులకీ మంచి టేస్టులుంటాయి; నాకూ వున్నాయి.

మల్లె పువ్వులు కనబడ్డా, మంచి కవిత్వం దొరికినా నేను వదల్లేను.

అలాగే ఆ వేళా వదల్లేక పోయాను.

ఎదురింట్లో - ఆయింటి వెలుగల్లేవున్న చెట్టు నిండుగా, వెండి పూలల్లే పూసి, ఆ చుట్టు పక్కలంతా కమ్మటి వాసనల తుఫానులు రేపుతున్న మల్లెపూలుచూచి- చూళ్ళేక పోయాను. చూసి వదల్లేక పోయాను.

నాక్కాసిని మల్లెపూలు కావాలన్నాను.

నవ్వమన్నా నవ్వటం చాతకాని మా జానకి- మా మేనమామ కూతురు - పకపకా నవ్వింది.

" నీకు పువ్వులెందుకు బావా, తల్లోపెట్టుకుంటావా."అని మళ్ళీ నవ్వింది. మేనత్త కొడుకు కదా అని సరస మాడింది.

మా జానకిని చూస్తే మగాడెవడికీ సరసమాడ బుద్ధి కాదు.

అందుకే నేను మరేమీ అనకుండా - " కాదులే నాక్కావాలి, కాసిని తెచ్చిపెట్టు" అన్నాను.

జానక్కి నా మీద ప్రేమవుంది . కాబోయే మొదుణ్ణని కాస్త గౌరవంకూడా వుంది. అంచేత

నామాట కాదన్లేదు.

ఒక్క పరుగున ఎదురింట్లోకి వెళ్ళి " సావిత్రీ! పువ్వులు కోసుకుంటున్నానే"అని గుమ్మంలోంచి ఓ కేక వేసి. వెళ్ళి చెట్టు మీద పడింది.

నేను మా మేనమామ గారింటి గుమ్మంలో నిలబడి చూస్తున్నాను.

జానకి పువ్వులు కోసి వొళ్ళో పోసుకుంటోంది.

ఎదురింటి దొడ్లోనే కాదు, ఇంటిలోపలకూడ, నిండుగా పూచిన వో మల్లెతీగ వుందని నా కప్పుడే తెలిసింది.

మల్లెతీగ తెల్లగా, తెల్లటి వెలుగల్లే నడిచొచ్చి, మల్లెపూలు కోస్తున్న జానకి పక్కన చేరింది.

జానకి నా గురించి చెప్పింది కాబోలు, తలతిప్పి, కళ్ళు చారెడేసి వెలుగులు విరజిమ్మగా నా వంక చూసింది.

నేను సౌందర్య ప్రియుణ్ని.

మంచి అందం కనబడితే మరి మాట్లాడలేను.

అప్పుడుకూడా - కనువిందైన ఆ అందాన్ని కన్నార్పకుండా చూశాను.

ఆ అమ్మాయి - పేరు సావిత్రి - జానకితో మాట్లాడుతూ మధ్య మధ్యలో తల తిప్పీ తిప్పనట్టుగా తిప్పినా వేపు చూస్తోంది.

తనుకూడా పువ్వులు కోసి జానకి వొళ్ళో పోస్తోంది.

అడక్కుండా వూచిన మల్లె చెట్టుకి మల్లే అప్పుడప్పుడూ అందంగా నవ్వుతోంది.

నేను పెద్ద మనిషిని.

నాకు మంచీ మర్యాదా తెలుసు

అలాగే నిలబడి అదేపనిగా ఒక పరాయి ఆడపిల్ల వంక చూడ్డం మర్యాద కాదని, లోపలి కెళ్ళిపోయాను.

ఆ ముందు రోజునే ఆ వూరొచ్చాను.

బి.ఎ పరీక్ష వ్రాసి, సరదాగా పదిరోజులు గడుపు దామని మా మేనమామగారింటి కొచ్చాను.

నా కొక్కడే మేనమామ; ఆయనకి జానకి ఒక్కతే కూతురు.

జానక్కి ముందు యిద్దరు మగపిల్లలు పుట్టి చచ్చిపోయారు.

జానకి తర్వాత ఎవరూ పుట్టలేదు

జానకి పుట్టక ముందే, మాయిద్దరికీ పెళ్ళి ఖాయం చేశేసారు మా వాళ్ళు

' ఈ సారి నీకు ఆడపిల్ల పుడుతుందిరా అన్నయ్యా!'- అందిట మా అమ్మ - మా అత్త జానకిని కడుపుతూండగా

" నీ నోటి వాక్యాన అలాగే పుట్టి , బతికి బట్టగడితే, నీ కొడుక్కి కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తానమ్మా!" - అన్నాడట మా మామయ్య

మా అమ్మ అన్నట్టుగానే ఆడపిల్ల పుట్టింది

అంతే, అప్పట్నించీ నేనూ జానకీ భార్యభర్తల కిందే లెక్క

కూతురెత్తు బంగారం కట్నమివ్వగలిగినంత ఆస్తి వుంది మా మామయ్యకి

బంగారం ఎవరికీ చేదుకాదు  నాకూ అంతే, మా వాళ్ళకీ అంతే

నాకు సరిపడే అందగత్తె కాకపోయినా  జానకి హైస్కూలు చదువు దాటి చదవక పోయినా, జానకి నా భార్య కావడం మా అందరికీ యిష్టమే

ఇప్పటిదాకా నా చదువు కాలేదని పెళ్ళి ఆగింది, ఇంక ఆగదు  ఈయేడో, కాకపోతే వచ్చేయేడో, అయిపోతుంది

నాకింకా చదవాలని వుందిగానీ, మా మామయ్య వొద్దన్నాడు

" చదివింది చాల్లే, నువ్వేం వుద్యోగాలు చెయ్యాలా, పూళ్ళేలాలా? ఇప్పుడు నీకేం తక్కువ ?" - అన్నాడు

నేను పెద్దలంటే గౌరవం గలవాణ్ణి

అందుకే మా మామయ్యమాట కెదురు చెప్పలేదు

నేను మాటకారిని

మాట్లాడ్డ మెలాగో, ఆడపిల్లల్తో మాట్లాడ్డ మెలాగో నాకు బాగా తెలుసు

సావిత్రి జానకి కోసమని మా మామయ్య గారింటి కొచ్చి నప్పుడల్లా నేనే కల్పించుకుని ఏదోవొకటి మాట్లాడ్డం ప్రారంభించాను

ఆ తర్వాత సావిత్రే నాతో మాట్లాడ్డం ప్రారంభించింది

ఒక నాడు మాటల మధ్యలో - " నాకు మల్లెపూలంటే చాలా యిష్ట" మన్నాను

" అవునట  జానకి చెప్పింది"- అని నవ్వింది సావిత్రి నవ్వి-

" పువ్వులు మీరేం చేసుకుంటారు?" తల్లో పెట్టుకుంటారా?" - అని సరసమాడింది.

నేను రసికుణ్ని.

నాకు సరసాలాడ్డం చాతవును!

అందుకే సావిత్రితో నేనూ చిన్నచిన్న సరసాలాడ్డం ప్రారంభించాను.

రోజూ సాయంత్రప్పూట వొడినిండా మల్లెపూలు కోసుకొచ్చి నా దోసిట్లో యిన్ని పోసి, మిగతావి జానకి కివ్వడం ప్రారంభించింది సావిత్రి.

నేను కవినే కాదు - కథకుణ్ని కూడా-

నాకు కథల్రాయడమే కాదు - కథలు చెప్పడమూ చాతనవును.

జానకినీ సావిత్రినీ కూర్చోబెట్టి అందమైన కథలు, కవిత్వంలాంటి కథలు చాలా చెప్పాను.

సావిత్రి వచ్చినప్పుడొక్కొక్కసారి జానకి లోపల ఏదో పనిలో వుండేది. అలాంటప్పుడు సావిత్రి సరాసరి నా దగ్గరకే వచ్చి కూర్చునేది.

అలాంటి సందర్భాల్లో సావిత్రికి - ప్రత్యేకంగానూ యింకా అందంగానూ యింకా తియ్యగానూ చాలా కథలు చెప్పాను.

నా గురించీ, నా చదువు గురించీ, నా బహుముఖ ప్రతిభ గురించీ, కాలేజీలో నాకున్న పలుకుబడి గురించీ కాలేజీ అమ్మాయిలకి నా మీదున్న ' పిచ్చి' గురించి, భారత ప్రధాని గురించీ, అమెరికా ప్రెసిడెంట్ గురించీ, సినిమాలు తియ్యడం గురించీ, అనర్గళంగా నేను మాట్లాడుతుంటే - బ్రతకనేర్చిన బంగారపు బొమ్మల్లే నా ముందు కూర్చుని, నవ్వటం తెలిసిన పువ్వల్లే నవ్వుతూ - ఆ నవ్వు పగడాల పల్చటి పెదాలమీద, కలవరేకుల కళ్ళలోనూ వెలుగుతుండగా అతి శ్రద్ధతో వినేది సావిత్రి.

నేను సత్యహరిశ్చంద్రుణ్ని.

సావిత్రి గురించి చాలా నిజాలు సావిత్రికే చెప్పాను.

నీ అంత అందమైన వాళ్ళు వెయ్యి కొకరుకూడా వుండరన్నాను.

నిన్ను పెళ్ళాడేవాడు ప్రపంచమందరిలోకీ అదృష్టవంతుడన్నాను.

నువ్వు ప్రపంచానికే రాణి కాదగ్గదాని వన్నాను.

నువ్వు ' కస్తూర్తి శేసాలు కనకాభిసేకాలు'-అనికూడా అన్నాను.

నేను అభ్యుదయ భావాలు గలవాణ్ని.

అందుకే సావిత్రి దగ్గర - సమాజంలోనూ, దేశంలోనూ జరగాల్సిన సంస్కరణల గురించి, సాధించాల్సిన అభ్యుదయం గురించీ చాలా ఉపన్యాసాలుకూడా యిచ్చాను.

స్త్రీలకి పురుషుల్తో సమానమైన స్వేచ్ఛాసాతంత్ర్యా లుండాలన్నాను.

వరకట్నాలు అంతరించాలన్నాను.

ఇలాంటి విషయాల్లో నాది చాలా విశాల హృదయమన్నాను.

నేను అందగాణ్ని.

అందంగా వుండటమే కాకుండా, వున్నదాని కంటే ఎక్కువ అందంగా కనబడ్డం కూడా నాకు చాతనవును.

సావిత్రికి ఏయే సమయాల్లో తీరికుంటుందో, ఏయే సమయాల్లో వస్తుందో నాకు తెలుసు.

సావిత్రి వచ్చే సమయానికి మల్లెపువ్వులా ముస్తాబై కూర్చునేవాణ్ని.

నేను సౌందర్య ప్రియుణ్నని యిందాకే చెప్పాను.

ప్రకృతి సౌందర్యమంటే నాకు మరీ యిష్టం.

మామామయ్యగారి వూళ్ళో - ఎక్కడ చూసినా పచ్చటి చేలూ, చెట్లూ, తోటలూనూ.

అక్కడున్న న్నాళ్ళూ, రోజూ సాయంత్రప్పూట చన్నీళ్ళ స్నానంచేసి, చల్లగాలి కడ్డుతగలని పల్చటి బట్టలేసుకుని, వూరిబయట పొలాల్లోకి షికారెళ్ళటం అలవాటు చేసుకున్నాను.

ఆ వేళ కూడా అలాగే బయల్దేరి, వూరిబయటి కెళ్లే సరికి - పొద్దు పడమటికి వాలింది.

పడమటికొండ - నిండా ఎర్రకలువలు పూచిన కొలనల్లే వుంది.

సూర్యుడు ఎర్రగాపెరిగిపోతున్నాడు.

పెరిగిన కొద్దీ, తన బరువు తాను మొయ్యలేనివాడిలా కిందికి వాలిపోతున్నాడు.

బంగారపు కొండ తగలబడుతున్నట్టుగా వున్న సంజ వెలుగులో - పేరు తెలియని పెద్ద పువ్వుల్లా, ఆకాశం మీంచి గుంపులు గుంపులుగా కిందికి వాలుతున్నాయి కొంగలు.

గాలి పైరుగాలిగా మారింది.

ఈ అందాలన్నింటికీ పరవశించిపోయి మెల్లగా నడుస్తున్న నేను,

అల్లంత దూరాన అనుకోకుండా కనిపించిన మరో గొప్ప అందాన్ని చూసి చటుక్కున ఆగిపోయాను.

నా ముందు వో పాతిక గజాల దూరాన - చేను గట్టు మీదున్న చిన్న మామిడి చెట్టు ముందు - మునిగాళ్ళ మీద నిలబడి, చెట్టు పంగలో వో చెయ్యేసి - కొద్దిగా ఎగిరి , కుడి చేత్తో చెట్టుకొమ్మనున్న కాయందుకోడానికి ప్రయత్నిస్తోంది సావిత్రి.

ఆమె వెనకాల నిలబడ్డ నాకు -కాయందుకోడానికి ప్రయత్నిస్తున్న ఆమెలో కనిపించిన అపురూపమైన అందాలు - నన్ను కాస్సేపు నిలబెట్టేసి, ఆ వెంటనే ముందుకు నడిపించాయి.

నేను చెట్టుదగ్గర కెళ్ళేలోగా మరో రెండుసార్లు ఎగిరి, కాయందుకుని కోసేసింది. నా అడుగుల చప్పుడు విని వెనక్కి తిరిగి చూసింది. నన్ను చూసి నవ్వింది.

" ఏమిటిలా వచ్చా"వన్నాను.

" వూరికే" -అంది మామిడికాయ ముని పంటితో కొరుకుతూ.

అక్కడికి కాస్త దూరానవున్న దిబ్బమీద కెళ్ళి యిద్దరమూ కూర్చున్నాం.

నేను మళ్ళీ అడిగితే- " వూరికే, మీరొచ్చినట్టే షికారుకొచ్చా" నంది, సిగ్గుపడుతున్నట్టుగా నవ్వింది.

నేను సమయా సమయాలు తెలిసిన వాణ్ని.

అంత అందంగా , అద్భుతంగా వున్న అలాంటి సమయాన-

అందమైన పక్కన కూర్చున్న ఆడపిల్లతో ఎలా మాట్టాడాలో నాకు తెలుసు.

అందుకే కొంతసేపు చాలా అందమైన తియ్యనైన మాటలు మాట్లాడాను.

ఇంతలో సూర్యుడింక కనబడ్డం మానేశాడు.

ఆకాశపు అవతలి అంచునుంచి - మొహం చాటంత చేసుకొని చంద్రుడు మెల్లమెల్లగా పైకొస్తున్నాడు.

పైరుగాలిమరింత చల్లబడింది.

దూరాన వూళ్ళో ఇళ్ళు మసకమసగ్గా కనిపిస్తున్నాయి.

అప్పుడు చెప్పింది సావిత్రి - " మీ కోసమే.. మీతో మట్టాడదామని వచ్చాను" అని.

మరి కాస్సేపటికి అసలువిషయం చెప్పింది మెల్లగా -

" మీరి వూరొచ్చిందగ్గిర్నించి మిమ్మల్ని చూస్తు న్నాను.. మీ మాటలు వింటున్నాను; మీకు

నా మనసిచ్చాను; మీకూ మీ అంతస్తుకీ నేను తగిన దాన్నికాను; నాకా సంగతి తెలుసు; కానీ మీరిన్నాళ్ళుగా చెప్తున్న మాటలు వింటే, మీరు నన్ను స్వీకరిస్తారన్న ఆశ వుంది; మీరు కాదంటే, మీరు నన్ను పెళ్ళిచేసుకోకపోతే.. నా జీవితం ఏమౌతుందో నాకు తెలీదు " - అంది. ఆతర్వాత మాట్లాడలేక పోయింది.

ఆవెంటనే నేనందుకున్నాను.

" నీకు నామీద మనసుండటం నా అదృష్ట" మన్నాను.

" నిన్ను నా భార్యగా స్వీకరిస్తే నా జన్మధన్యమై పోతుం" దన్నాను.

ఇంకా యిలాంటివే చాలా అన్నాను.

సావిత్రి మొహంలో వెన్నెల వెలిగింది.

నేను తెలివైన వాణ్ని.

తెలివైన వాడు - అలాంటి సమయాన్నీ, అవకాశాన్నీ ఎలా వుపయోగించుకుంటాడో నేనూ అలాగే ఉపయోగించుకొన్నాను.

నేను వెర్రివాణ్నికాదు.

అందంగా వున్నంతమాత్రాన, ఒక్కసారి స్వర్గతుల్యమైన ఆనందాన్ని ఇచ్చినంత మాత్రాన - తిండికీ బట్టకీ కూడా సరిగా గడిచే స్థితిలేని సావిత్రిని ఎలా పెళ్ళి చేసుకుంటాను?బంగారపు కొండలాంటి జానకిని వదులుకొని నా భవిష్యత్తు ఎలా పాడుచేసుకుంటాను?

నేను దొంగ వెధవని.

చిక్కుల్లోంచి తప్పించుకోవడం నాకు బాగా చాతనవును.

అందుకే ఆ మర్నాటి ఉదయం. చిన్న దొంగనాటకమాడి - అర్జంటుగా యింటికి వెళ్ళాలని మామామయ్యతో చెప్పి, మళ్ళీ సావిత్రి మొహం చూడకుండా బండెక్కేశాను.

మళ్ళీ వేసవిలో నాకూ జానకీ ఘనంగా పెళ్ళి జరిగింది.

మామామయ్యకూడా తెలివైనవాడే.

సావిత్రి విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధతీసుకొని, ప్రక్కవూళ్ళో కూలిపని చేసుకొని బతికేవాడి నెవడినో కుదిర్చి, తన చేతుల మీదగా పెళ్ళి జరిపించి, మా పెళ్ళికి ముందే కాపరానికి పంపేశాట్ట.

నేనిప్పుడు ఒక పెద్ద పట్నంలో... మా మామయ్య యిచ్చిన డబ్బుతో పెద్ద వ్యాపారం చేస్తున్నాను.

పట్నాల్లోకి పైరుగాలి రాదు.

ఎప్పుడన్నా పల్లెటూరు వెళ్ళినప్పుడూ, కమ్మటి పైరు గాలి వంటికి తగిలినప్పుడూ, నిండుగా విరబూసిన మల్లె గుబురు చూసినప్పుడూ సావిత్రి గుర్తొస్తుంది.

నేను మనిషిని.

నేను మనిషినని గుర్తొచ్చినప్పుడు మాత్రం - సావిత్రి గుర్తొచ్చి, గుండె పొరల్లో ఏదోమూల సన్నటి బాధ కలుక్కుమంటుంది. ●

*(స్వాతి-జన్మదిన సంచిక- జూన్ - 1972)*

*(ప్రసిద్ధ చిత్రకారుడు చంద్ర ముందే బొమ్మగీసి పేరుకూడా పెట్టేసి, దానికి సరిపోయే ప్రేమకథరాయమంటే, అందుకు నేను చేసిన ప్రయత్నమిది. ఇది ప్రేమ కథ అవునో కాదో నాకు తెలీదు - రచయిత).*